

కడ్తాల్ తహసీల్దార్‌గా జయశ్రీ

కడ్తాల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల తహసీల్దార్‌గా జయశ్రీ నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ పనిచేస్తున్న ముంతాజ్ చేవెళ్ల డీఏవోగా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో హైదరాబాద్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జయశ్రీకి కడ్తాల్‌కు పోస్టింగ్ ఇచ్చారు. కాగా, ముంతాజ్ కడ్తాలలో రెండు సంవత్సరాల పాటు సేవలు అందించారు.

దేశంలో ప్రజావ్యతిరేక విధానాల

ప్రభుత్వం నడుస్తోంది

ఏఐసీసీ పరిశీలకుడు, ఎంపీ రాబర్ట్ బ్రూస్



సమావేశంలో రాబర్ట్ బ్రూస్, కేఎల్లార్

మహేశ్వరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించే ప్రభుత్వం ఉందని, ఓటు చోరీ ద్వారా మోదీ ప్రధానిగా కొనసాగుతున్నారని ఏఐసీసీ పరిశీలకుడు, ఎంపీ రాబర్ట్ బ్రూస్ ఆరోపించారు. తుక్కుగూడలోని లక్ష్మీ గార్డెన్‌లో శనివారం డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం రాహుల్ గాంధీ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. సమర్థత, క్రమశిక్షణ, సీనియారిటీ కలిగిన వారికి డీసీసీ పదవులు ఇస్తున్నామని చెప్పారు. పదవి దక్కని వారు నిరాశ చెందవద్దని, వారికీ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. చల్లా నర్సింహారెడ్డి, కేఎల్లార్, దేవ భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, తీగల అనితారెడ్డి, కృష్ణానాయక్, నందిగామ నర్సింహ్మ, జానకీరామ్, జ్యోతి భీంభరత్, ఈశ్వర్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ నందీశ్వర్‌రెడ్డి

యాచారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం యాచారం, నక్కగుట్టతండాల వద్ద డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించడంతో పాటు వాహనాలు తనిఖీ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగ్ పట్టుకోమని గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ఇరికించే ప్రమాదముందనే విషయాన్ని గమనించాలన్నారు. యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ కింద ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై మధు తదితరులున్నారు.

● కమ్మేసిన పొగమంచు



జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో పొగమంచు కమ్మేసింది. శనివారం ఉదయం మండల పరిధిలోని తుమ్మలపల్లి, లచ్చంపేట, వనంపల్లి, లాల్‌పహాడ్, చౌదరిగూడ తదితర గ్రామాల్లో దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో దారి కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చౌదరిగూడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి)

రాజ్యాంగాన్ని సవరించి బీసీ రిజర్వేషన్లు కల్పించాలి

- ఆమోదించకుండా అడ్డుకుంటున్న బీజేపీ
- మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆయన ఆరోపించారు. ఆమనగల్లులో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కల్పనపై హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మంత్రి జూపల్లి పాల్గొన్నారు. అనంతరం స్థానిక బస్టాండ్ ఎదుట జేఏసీ శిబిరంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర సాధన పోరాట స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధనకు బీసీ సమాజం రాజకీయాలకతీతంగా ఏకమై కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపు నిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కల్పనకు అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపితే కేంద్రం ఆమోదించకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ఈ విషయంలో

మిగతా 10వ పేజీలో...

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత కల్పించాలని కోరుతూ బంద్ ఫర్ జస్టిస్ పేరుతో బీసీ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి శనివారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. జిల్లా బంద్‌కు అన్నివర్గాల నుంచి మద్దతు లభించడంతో ఎక్కడికక్కడే జనజీవనం స్తంభించింది. బీసీ సంఘాలతో పాటు ఆయా రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు బంద్‌కు మద్దతు తెలపడంతో పాటు స్వచ్ఛందంగా నిరసనలో పాల్గొన్నాయి. జిల్లాలో అత్యవసర సేవలు మినహా మిగతా సేవలన్నీ నిలిచిపోయాయి.

షాద్‌నగర్ : ర్యాలీలో కాంగ్రెస్, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు



బంద్ సంపూర్ణం

అత్యవసర సేవలు మినహా అన్నీ నిలిపివేత

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా తెల్లవారుజాము నుంచే బంద్ ప్రభావం కనిపించింది. ఆర్టీసీ బస్సులన్నీ డిపోల వరకే పరిమితమయ్యాయి. బీసీ సంఘాలతో పాటు ఆయా రాజకీయ పార్టీల నేతలు బస్సుల బయటకు రాకుండా తెల్లవారుజాము నుంచే ఆర్టీసీ డిపోల ఎదుట బైఠాయించారు. అలాగే జాతీయ రహదారులు, ప్రధాన కూడళ్లలో రోడ్లను దిగ్బంధించారు. దీంతో ఎక్కడికక్కడే రవాణా నిలిచిపోయింది. ఆర్టీసీ బస్టాండ్‌ల్లో బస్సులు, జనం లేక నిర్మానుష్యంగా కనిపించాయి. ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో తమ ప్రయాణాన్ని కొనసాగించారు. వ్యాపార,

మిగతా 10వ పేజీలో...

స్తంభించిన జనజీవనం
ఆగిన బస్సులు... నిలిచిన రవాణా
తెల్లవారు జాము నుంచే బంద్ ప్రభావం
స్వచ్ఛంద బంద్ పాటించిన వ్యాపారులు
పకడ్బందీగా పోలీసుల బందోబస్తు



ఆమనగల్లులో మూతబడిన దుకాణాలు



నిర్మానుష్యంగా చేవెళ్ల ఆర్టీసీ బస్టాండ్



షాద్‌నగర్‌లో హైవేపై ట్రాఫిక్‌జాం

ఈసారీ తగ్గాయ్!

మద్యం షాపులకు ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
ఉమ్మడి జిల్లాలో 25వేలకుపైగా అప్లికేషన్లు
గతంతో పోలిస్తే 30శాతం తగ్గుదల
చివరి రోజు పోటెత్తిన దరఖాస్తుదారులు
23న లాటరీ.. దుకాణాల కేటాయింపు



బండ్లగూడ జాగీర్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారుల క్యూ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య ఈ సారి గణనీయంగా తగ్గింది. గతంతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ దరఖాస్తులు వచ్చాయి. అయితే చివరి రోజు మద్యం వ్యాపారులు దరఖాస్తు చేసుకునేందుకు పోటెత్తారు. దీంతో రాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 514 మద్యం షాపులు ఉన్నాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 249 మద్యం దుకాణాలు ఉండగా, మేడ్చల్ జిల్లాలో 202, వికారాబాద్ జిల్లాలో 59 మద్యం దుకాణాలు ఉన్నాయి. మద్యం దుకాణాల కేటాయింపు (2025-27)కు సంబంధించి గత సెప్టెంబరు 26 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం విదితమే. దీనికి గడువు శనివారంతో ముగిసింది. దీంతో రాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. శనివారం ఒక్క రోజే దాదాపు 10వేల వరకు దరఖాస్తులు

మిగతా 9వ పేజీలో...


కేజీబీవీలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

మాదక ద్రవ్యాల నివారణపై కేజీబీవీలో చిత్రలేఖన పోటీలు

ధారూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ధారూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థినులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం వేడుకల్లో భాగంగా మహిళాశిశు సంక్షేమ శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా మహిళ సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో విద్యాలయంలో పోటీలను ఏర్పాటు చేశారు. చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యల నిపుణులు రాందాస్, సఖీ సెంటర్ ఇన్‌చార్జి రేష్మా, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపాధ్యాయినులు విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి


ఎన్ఎస్ఎస్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎస్.రాధిక

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంచుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక అన్నారు. కళాశాల విద్యార్థుల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ముగింపు సమావేశం రాయపోల్‌లో శనివారం జరిగింది. వారం పాటు చేపట్టిన కార్యక్రమాలను విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంతో తమ విద్యార్థులు గ్రామస్తులతో మమేకమై ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నారని అన్నారు. ఆరోగ్య విషయాలను గ్రామస్తులకు వివరించడంతోపాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలనేది ప్రధానంగా తీసుకున్నారన్నారు. పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత అనేది ముఖ్యమని ఆమె వివరించారు. విద్యార్థులిచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా.చింతల రాకేష్‌భవానీ, డా.రమేష్, రాయపోల్ మాజీ సర్పంచ్ బల్వంతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అలివేలు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందుంజ


చెక్కు అందిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

కులకచర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందుంటుందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. కులకచర్ల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ తరఫున రూ.6లక్షల సహాయ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంతో మంది టీచర్లు రిటైరైనా వారికి రావాల్సిన డబ్బులు, బెనిఫిట్లు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్యగౌడ్, సౌమ్యరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆనందం, జిల్లా ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ మల్లేశం, జిల్లా కోశాధికారి మొయిజ్‌ఖాన్, మండల ఉపాధ్యక్షుడు అజ్మత్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు

కులకచర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను శనివారం ఘనపూర్‌కు చెందిన పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో కలిశారు. గ్రామ ంలో జరిగే శివాలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని గవర్నర్ ప్రశంసించారు. దైవ కార్యంలో ముందుకు సాగాలని గోసేవ దైవ సేవతో సమానం అన్నార ని రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బాలస్వామి, ఘనపూర్ యువజన సంఘాల నాయకులు దండు శివ తదితరులు పాల్గొన్నారు.


గవర్నర్‌తో మాట్లాడుతున్న రాఘవేందర్‌గౌడ్

డీసీసీ చీఫ్ ఎవరైతే బాగుంటుంది?

● రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాబర్ట్
● షాద్‌నగర్‌లో అభిప్రాయ సేకరణ


పేర్లను ప్రతిపాదిస్తున్న ఏఐసీసీ సభ్యుడు రాబర్ట్

షాద్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి నియామకానికి పార్టీ నేతలతో అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం షాద్‌నగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్లో ఏఐసీసీ సభ్యులు, ఎంపీ రాబర్ట్ బ్రూస్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పరిశీలకులు కర్నె శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో చేపట్టిన అభిప్రాయ సేకరణ గురించి పార్టీ కార్యకర్తలకు వివరించారు. జిల్లా అధ్యక్షులుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర కులస్తుల్లో ఎవర్ని నియమిస్తే బాగుంటుందో చెప్పాలని పార్టీ కార్యకర్తలను కోరారు. జిల్లా నూతన అధ్యక్షుడి నియామకం గురించి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని ఆయా దరఖాస్తులను పరిశీలించి పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకు ఎవరిని నియమిస్తే బాగుంటుందో అన్న విషయం గురించి అభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. మీ మనస్సులో ఉన్న విషయాన్ని బహిర్గతంగా వెల్లడించకుంటే రహస్యంగా నైనా చెప్పొచ్చని వారు సూచించారు. అనంతరం కొంతమంది పార్టీ నాయకులతో అంతర్గతంగా చర్చించినట్లు సమాచారం. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలి


మాట్లాడుతున్న సదానందంగౌడ్

కొడంగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షనర్ల జీపీఎఫ్ నిధులు, టీఎస్‌జీఎల్ఐసీ నిధులు, సరెండర్ లీవ్‌లు లాంటి అన్ని రకాల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు బేసిక్ పేతో రెగ్యులరైజ్ చేయాలన్నారు. పెండింగ్‌లోని ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, ఎండీ.షఫీ, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్, రాష్ట్ర కౌన్సిలర్‌లు పవన్‌కుమార్, శ్రీనివాసరావు, విష్ణుకుమార్, ఏఐఎస్టీఎఫ్ నాయకులు పరమేశ్, గణేశ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశంలో చెత్తవేసిన వ్యక్తికి జరిమానా

మేడ్చల్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపల్ పరిధి పూడూరులో నిబంధనలకు విరుద్ధంగా చెత్త డంప్ చేసిన వ్యక్తిపై మున్సిపల్ అధికారులు రూ.20వేలు జరిమానా విధించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి జరిమానా విధించిన వ్యక్తి వద్ద నుంచి శనివారం రూ.20వేల డీడీని స్వీకరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంచదర్ తదితరులు పాల్గొన్నారు.


డీడీ స్వీకరిస్తున్న కమిషనర్









బీజేపీ కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలన


బీజేపీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మహావీర్ ఆసుపత్రి సమీపంలో నిర్మాణం జరుగుతున్న భారతీయ జనతా పార్టీ(బీజేపీ) వికారాబాద్ జిల్లా నూతన కార్యాలయ నిర్మాణ పనులను శనివారం మాజీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, దిశ కమిటీ సభ్యుడు వడ్ల నందు ఆధ్వర్యంలో జిల్లా నాయకులు పరిశీలించారు. నిర్మాణ పనులపై పలు సూచనలు చేస్తూ, కార్యాలయం పూర్తయ్యాక పార్టీ సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యంగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, పాండుగౌడ్, పోకల సతీష్, అనిల్, చందు, సురేష్‌కుమార్, కాంట్రాక్టర్ జయప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను తరలించొద్దు

కొడంగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి శివారులో మంజూరైన మెడికల్ కళాశాల, పాత కొడంగల్‌లో సమీకృత గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కన్వీనర్ లక్ష్మీనారాయణగుప్త, కో కన్వీనర్‌లు జి.సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు అన్నారు. శనివారం కొడంగల్ పట్టణంలోని మహదేవ శివాలయం ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడారు. మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను లగచర్లకు తరలించకుండా ప్రతిపాదిత ప్రాంతంలోనే కొనసాగించాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ కళాశాలను స్వాగతిస్తున్నామన్నారు. కానీ కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న కొడంగల్ అభివృద్ధి, జేఏసీ కమిటీ నాయకులు

ఐరన్ ఇంజక్షన్ వికటించి గర్భిణి మృతి

● పీహెచ్‌సీ ఎదుట బంధువుల ఆందోళన


పంతంగి మానస(ఫైల్)

మంచాల, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఐరన్ ఇంజక్షన్ వికటించి గర్భిణి మృతి చెందిన ఘటన మంచాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన పంతంగి మానస(22) ఏడు నెలల గర్భవతి. సాధారణ వైద్య పరీక్షల్లో భాగంగా పీహెచ్‌సీకి వచ్చి మానసకు ఐరన్ ఇంజక్షన్ తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. అయితే, ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే మానస తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మరణించింది. కాగా, డాక్టర్ల నిర్లక్ష్యమే మానస మృతికి కారణమంటూ మృతురాలి బంధువులు, గ్రామస్తులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మంచాల సీఐ మధు అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపడతామని చెప్పారు.

తాగునీటి పునరుద్ధరణకు చర్యలు

● జుంటివాగును పరిశీలించిన ఏఈ జోయేల్


పైపులు కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ - తాండూరు రోడ్డు పక్కన జుంటివాగు వరద ఉధృతికి కొట్టుకుపోయిన పైపులైన్‌ను శనివారం తాండూరు సబ్ డివిజన్ డీఈఈ ఆదేశానుసారం ఏఈ జోయెల్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రెండు, మూడు రోజుల్లో కొత్త పైపులను అమర్చి, మండలానికి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. 'భగీరథా.. ఏమిటీ వ్యథ!' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు తాండూరు డీఈఈ విజయ్‌కుమార్‌ను జుంటివాగు ఉధృతికి కొట్టుకుపోయిన పైపుల విషయంపై ఆశాఖ ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం.


చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కొడంగల్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్

దుద్యాల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కొడంగల్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ సూచించారు. శనివారం దుద్యాల మండలం చెట్టుపల్లి తండా కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో లీగల్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా చట్టాలపై అవగాహన కల్పించారు. జడ్జి శ్రీరామ్, సీఐ శ్రీధర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు సోషల్ మీడియా, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ శ్రద్ధతో చదవాలన్నారు. పాఠశాలలో వసతులపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, బార్ ఉపాధ్యక్షుడు బస్వరాజ్, కార్యదర్శి రమేశ్, కిష్టయ్య, పోలీసు సిబ్బంది అమృత, శంకర్ పాల్గొన్నారు.

తాండూరు ఎంపీవోగా డానియల్


ఎంపీవో డానియల్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీడీఓ, కార్యదర్శులు

తాండూరు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ)గా డానియల్ శనివారం విధుల్లో చేరారు. ఇన్‌చార్జి ఎంపీవో వీరన్న నుంచి ఎంపీవో డానియల్ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంపీవోకు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని సూచించారు. కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ పాయింట్‌ల పరిశీలన



బషీరాబాద్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఇబ్బందుల తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కలెక్టర్ ఆదేశానుసారం తాండూరు మైన్స్, బషీరాబాద్ రెవెన్యూ ఆర్ఐలు నిర్మల, నాగార్జునరెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ ఇసుక రీచ్ పాయింట్ల గుర్తింపు కోసం సంయుక్తంగా కదిలారు. నవాంద్గీ, గంగ్వార్, జీవన్గి, ఇందర్‌చెడ్ కాగ్నా పరివాహక ప్రాంతాల్లో ఇసుక తరలింపుకు ఎక్కడ అనుకూలంగా ఉన్నాయో తిరిగి పరిశీలించారు. ఏ ప్రాంతంలో ఎక్కడెక్కడా ఇసుక తరలింపుకు అనుమతులు ఇవ్వొచ్చానేది కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని అధికారులు తెలిపారు.

బీజేపీపై బురదజల్లే ప్రయత్నం సరికాదు

● రంగారెడ్డి జిల్లా ఓబీసీ కన్వీనర్ ఎల్గని వెంకటేశ్ గౌడ్


మాట్లాడుతున్న వెంకటేశ్‌గౌడ్

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రంలో అన్ని పార్టీలు బీజేపీ ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు సరికాదని రంగారెడ్డి జిల్లా ఓబీసీ కన్వీనర్ ఎల్గని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ పదవిలో ఉన్న గవర్నర్, రాష్ట్రపతి రాజ్యాంగం ప్రకారం విధులు నిర్వర్తించడం వారి పని అన్నారు. వారిని కించపరిచేలా శనివారం బంద్‌లో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు ఆరోపణలు చేయడం సరికాదని సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేసే వారికి రాజ్యాంగంపై అవగహన లేదని విమర్శించారు. మతపర రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని, బీసీ రిజర్వేషన్లకు అనుకూలం అని స్పష్టం చేశారు. బీసీల అభ్యున్నతికి బీజేపీ కృషిచేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తుచేసుకోవాలని కోరారు. బీసీలను మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతోందన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ, కాంగ్రెస్


దేవీలాల్‌నాయక్

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడంలో బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మహేశ్వరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ దేవీలాల్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతిచ్చినా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు నాటకాలు ఆడుతున్నాయన్నారు. బీసీ రిజర్వేషన్ల పోరాటంలో బీఆర్ఎస్ ముందుంటుందని పేర్కొన్నారు.

కొడంగల్ అధ్యాపకుడికి డాక్టరేట్


ఆర్.శ్రీనివాస్

కొడంగల్ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు ఆర్.శ్రీనివాస్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇచ్చిందని ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. ఓయూ బోటనీ ప్రొఫెసర్ ఎస్.లక్ష్మీభవానీ పర్యవేక్షణలో.. 'స్టడీ ఆఫ్ బయోయాక్టీవ్ కాంపౌండ్స్ ఆఫ్ మెడిసినల్ ప్లాంట్స్ ట్రెడిషనల్లీ యూజ్డ్ ఫర్ జాండీస్' అనే సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో శ్రీనివాస్ అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. తమ అధ్యాపకుడు డాక్టరేట్ పొందడం గర్వకారణమన్నారు.

అనురాగ్‌లో ముగిసిన హ్యాకథాన్


సత్యేంద్రకుమార్‌కు జ్ఞాపిక ఇస్తున్న అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : పోచారం మున్సిపాలిటీలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఐటీఈటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి హ్యాకథాన్ 'మెకోవెట్ ' ముగింపు కార్యక్రమానికి ఎఎఫ్ఎం సంస్థ ప్రతినిధి సత్యేంద్రకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 30గంటల పాటు జరిగిన హ్యాకథాన్‌లో 60మంది విద్యార్థులు మూడు డొమైన్లల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో నిర్వహిస్తున్న హ్యాకథాన్‌లలో పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సికిందర్ బాబా, శ్రీనివాస చలపతి, మదన్ మోహన్‌రెడ్డి, సరిత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈసారీ తగ్గాయ్!


మేడ్చల్ జిల్లాలో దరఖాస్తులు అందజేస్తున్న ఔత్సాహికులు

(ఏడో పేజీ తరువాయి)

రావడం గమనార్హం. రాత్రి 10గంటల తరువాత కూడా దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. శుక్రవారం వరకు మొత్తం ఉమ్మడి జిల్లాలోని 15,008 దరఖాస్తులు రాగా శనివారం దాదాపు 10వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో శంషాబాద్ డివిజన్‌లో అత్యధికంగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తరువాత సరూర్‌నగర్, మేడ్చల్‌లో ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తులను ఎక్సైజ్ శాఖ అధికారులు బోడుప్పల్‌లోని ఓ ఫంక్షన్ హాలులో దరఖాస్తులను స్వీకరించారు. శనివారం రాత్రి 7 గంటల వరకు మేడ్చల్ ఎక్సైజ్ పరిధిలోని 4,500 దరఖాస్తులు, మల్కాజిగిరి ఎక్సైజ్ పరిధిలోని మద్యం దుకాణాలకు 4,700 దరఖాస్తులొచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. రాత్రి 7గంటల తర్వాత కూడా దరఖాస్తుదారులు పెద్దఎత్తున లైన్లలో ఉండటంతో అధికారులు అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. అతి తక్కువ దరఖాస్తులు వికారాబాద్ జిల్లాలో వచ్చాయి. ఇదిలా ఉంటే గతంలో ఉమ్మడి జిల్లాలో 38వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. అప్పట్లో ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల రుసుం నిర్ణయించారు. ఇది నాన్ రిఫండబుల్ కావడంతో దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి భారీ ఆదాయం వస్తోంది. ఇలా దరఖాస్తుల స్వీకరణ ద్వారానే గతంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.800కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. అయితే ఇపుడు కొత్త మద్యం దుకాణాలు కేటాయింపునకు సంబంధించి దరఖాస్తు రుసుము రూ.3లక్షలుగా నిర్ణయించారు. కేవలం దరఖాస్తుల స్వీకరణ ద్వారానే ఉమ్మడి జిల్లాలో రూ.వెయ్యి కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశముంటుందని భావించారు. అయితే ఇపుడు దరఖాస్తులు 30శాతం వరకు తగ్గి ఆదాయం తగ్గింది. గతంలో కంటే ఈసారి దరఖాస్తు రుసుం పెంచినా ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో రాలేదు.

సిండికేట్లే కారణమా?

ఈ సారి మద్యం దరఖాస్తులు గణనీయంగా తగ్గడానికి సిండికేట్లు కారణమని తెలుస్తోంది. మద్యం వ్యాపారుల సిండికేట్ల కారణంగా ఈ సారి ఆదాయం తగ్గవచ్చని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వార్త కథనం కూడా ప్రచురించిన విషయం తెలిసిందే. ఇపుడు అదే నిజమైంది. మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుము పెంచడంతో మద్యం వ్యాపారులంతా ఒక్కటయ్యారు. వీరికి తోడుగా కొందరు రాజకీయ నాయకులను, శ్రీమంతులను, ఇతర వ్యాపారులను జత చేసుకుని సిండికేట్‌గా మారారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు సిండికేట్లుగా మారి ఒకరినొకరు అవగాహనతో దరఖాస్తు చేసుకున్నారు. నోటిఫికేషన్ విడుదల కాకముందు నుంచే దుకాణాలను దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. రిజర్వేషన్ వర్గాలకు కేటాయించిన దుకాణాలను దక్కించుకునేందుకు ఆయా వర్గాల వారి పేరుతో దరఖాస్తులు వేయించారు.

ఈ నెల 23న లాటరీ

మద్యం దుకాణాల కోసం వచ్చిన దరఖాస్తులను ఈ నెల 23వ తేదీన లాటరీ తీసి దుకాణాలు కేటాయించనున్నారు. లాటరీలో దుకాణం దక్కిన వారికి 2025 డిసెంబరు 2 నుంచి 2027 నవంబరు 30వ తేదీ వరకు రెండేళ్ల పాటు లైసెన్స్ జారీ చేస్తారు. మద్యం దుకాణాల కేటాయింపులో ఎస్సీ ఎస్టీ, గౌడ వర్గాలకు కొన్ని షాపులు రిజర్వు చేశారు.

విద్యార్థులు కలలను సాకారం చేసుకోవాలి

● జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు
● విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థినులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, కళాశాల చైర్మన్ రత్తయ్య

ఘట్‌కేసర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషిచేయాలని జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం కొండాపూర్‌లో గల విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నాలుగేళ్ల పాటు శ్రమించి ఉన్నత విద్యను పూర్తి చేశారన్నారు. నేటి నుంచి ఉద్యోగాన్వేషన చేయాల్సి ఉందన్నారు. ఏదో ఉద్యోగం వస్తే చాలు అనుకోకుండా మరింత రాణించేందుకు శ్రమించాలన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా విద్యార్థినులు సాధన చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ లావు రత్తయ్య, డాక్టర్ సతీష్‌రెడ్డి, కళాశాల సీఈవో బోయపాటి శ్రవణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి



ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి అని ఘట్‌కేసర్ సీఐ ఎం.బాలస్వామి అన్నారు. ఘట్‌కేసర్‌లోని పాత మున్సిపాల్ కార్యాలయం వద్ద అనుమతి లేని దుకాణం యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దీపావళి పర్వదినంపైనే ...

పూల రైతుల ఆశలు

పండుగ రోజుల్లో ధరలు పెరుగుతాయని అన్నదాతల నమ్మకం

● చేవెళ్ల డివిజన్‌లో భారీగా పూల సాగు
● వర్షాలకు కొంత వరకు పూలకు నష్టం


చేవెళ్ల మండలం ఇబ్రహీంపల్లి గ్రామంలో కోసేందుకు సిద్ధంగా ఉన్న బంతి పూలు


పలుగుట్ట గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న చామంతి తోట

చేవెళ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కష్టపడి సాగు చేసిన పూల రైతులు తమ ఆశలన్నీ దీపావళి పండుగపైనే పెట్టుకున్నారు. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న చేవెళ్ల నియోజకవర్గంలో రైతులు కొన్నేళ్లుగా వాణిజ్య పంటలు, కూరగాయలతో పాటు పూల తోటలను ఎక్కువగా సాగుచేస్తున్నారు. చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో ఈ ఏడాది భారీగా పూలసాగు చేశారు. అయితే ఇటీవలి భారీ వర్షాలకు కొంత మేర పూల తోటలు దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. ఉన్న పంటకైనా దీపావళికి పూల ధరలు కలిసొస్తాయని ఆశతో ఉన్నారు. పండగ సందర్భంగా పూల ధరలు పెరిగి గిట్టుబాటు అవుతుందని రైతులు ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్ నగర సమీప గ్రామాల రైతులు ఎక్కువగా పూలసాగు చేస్తున్నారు. పండగలు, శుభకార్యాలు జరిగే సమయాల్లో నగరంలో ఎక్కువగా పూలకు డిమాండ్ ఉంటుందనే సాధారణ పంటలకు బదులు పూలు పండిస్తున్నారు. హైదరాబాద్‌లోని పలు మార్కెట్లకు పూలను తరలిస్తున్నారు. దీపావళి, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు జరుగుతుండడంతో పూలకు మార్కెట్‌లో బాగానే డిమాండ్ ఉందని రైతులు చెబుతున్నారు. చేవెళ్ల మండలం పలుగుట్ట, కందవాడ, చేవెళ్ల, చన్వెల్లి, పామెన, ఆలూరు, కౌకుంట్ల, ఇబ్రహీంపల్లి, వెంకన్నగూడ, తంగడ్‌పల్లి, ముడిమ్యాల్, కమ్మెట, ఎన్కెపల్లి, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు పూల తోటలు సాగు చేశారు. చేవెళ్ల డివిజన్ పరిధిలో 800 ఎకరాలకు పైగానే రైతులు పూల సాగు చేశారు. కాగా చామంతి సాగుకు ఎకరానికి రూ.60వేలు, బంతి తోటకు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే పండుగకు ఒకటి రెండు రోజుల ముందు పొలాల్లో పూలను కోసేందుకు సిద్ధంగా ఉంచారు. ముఖ్యంగా దీపావళి పండుగకు బంతి పూలకు ఎక్కువగా గిరాకీ ఉంటుంది. దుకాణాలు, గృహాలు, వాణిజ్య సముదాయాల అలంకరణకు బంతి పూలనే ఎక్కువ వాడుతారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ మార్కెట్‌లో చామంతి కిలో 100, బంతి రూ.10, లిల్లీ రూ.70 నుంచి 80 ఉందని చెబుతున్నారు. సోమవారం దీపావళి ఉండటం, లక్ష్మీపూజలకు, తోరణాలకు ఎక్కువగా పూల వాడకంతో ధర కిలోకు 20 నుంచి 30 రూపాయల వరకు పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల నుంచి పూల రాకతో...

నెల క్రితం కురిసిన భారీ వర్షాలతో పూల రైతులకు నష్టం వాటిల్లింది. పూలు తోటల్లో నీరుపట్టి మొక్కలు ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు పూలు భారీగా వస్తుండడంతో స్థానిక పూల రైతులకు ధర రావడం లేదని అంటున్నారు. దీంతో సాధారణ రోజుల్లో ధర తక్కువగా ఉంటోందని చెబుతున్నారు. పండుగలు, పెళ్లిళ్ల వంటి ప్రత్యేక సమయాల్లోనే కాస్త ధర వస్తుందని పూల సాగు రైతులు అంటున్నారు.

రెండు ఎకరాల్లో పూలతోట సాగు చేశా



ఎప్పటి మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎకరం నర పొలంలో చామంతి, అర ఎకర బంతి తోట సాగు చేశాను. మార్కెట్‌లో పూలకు మంచి ధర ఉంటే పెట్టుబడితోపాటు లాభాలు వస్తాయి. భారీ వర్షాల వలన కొంత వరకు పూలతోటలు దెబ్బతిన్నాయి. బాగున్న మొక్కలు మాత్రం పూలు పూస్తున్నాయి. పండుగనే ఆశలపెట్టుకున్నాం.

- శేఖర్‌రెడ్డి, పూల రైతు, పలుగుట్ట

బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

● 42శాతం రిజర్వేషన్లను సాధిస్తాం
● నిరసన ర్యాలీలో హోరెత్తిన నినాదాలు
● ఎమ్మెల్యే శంకర్ అరెస్టు.. విడుదల


షాద్‌నగర్ బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసి, 42శాతం రిజర్వేషన్లను సాధించే వరకు పోరాటం చేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ శనివారం షాద్‌నగర్‌లో చేపట్టిన బీసీ బంద్‌లో ఎమ్మెల్యే, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బస్సులు బయటకు వెళ్లకుండా శనివారం తెల్లవారుజాముననే ఎమ్మెల్యే, కార్యకర్తలు ఆర్టీసీ బస్టాండ్ గేటు వద్ద ధర్నా చేసి బస్సులను స్తంభింపజేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేశంపేట రోడ్డులో 44వ నంబరు జాతీయ రహదారిపై ఎమ్మెల్యే, కార్యకర్తలు బైఠాయించారు. వాహనాలు స్తంభించడంతో పోలీసులు నాయకులను అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 42శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్‌ను తెచ్చారని గుర్తుచేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడం లేదని అన్నారు. తెలంగాణాలో మొదలైన బీసీ ఉద్యమం దేశవ్యాప్తమై ప్రధాని మోదీ మెడలు వంచి రిజర్వేషన్లను సాధించుకుంటామని అన్నారు.

రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

పరిగి: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి బంద్‌లో పాల్గొని మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లపై కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. బీజేపీ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించడం లేదని ఆరోపించారు. ఢిల్లీకి అఖిల పక్షంతో బీజేపీ, బీఆర్ఎస్ కలిసిరావాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీసీలు బీజేపీ నిలదీయాలని సూచించారు.

ఉద్యమం ఇంతటితో ఆగదు

బీసీ ఉద్యమం ఇంతటితో ఆగదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్,జాతీయ కార్యదర్శి కె.హన్మంతు అన్నారు. పార్టీ మెడలు వంచి రిజర్వేషన్లకు మద్దతు తెలిపేలా వొత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదం తెలిపే వరకు పోరాటం ఆగదన్నారు. బంద్‌లో కాంగ్రెస్ నాయకులు కొమిరె రాంచంద్రయ్య, జి.వెంకట్‌రాంలు, జింకల యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, ఆర్.అంజనేయులు, ఎస్.భాస్కర్, బీజేపీ నాయకులు ప్రహ్లాద్‌రావు, రాము యాదవ్, పెంటయ్య, బాలు, జేఏసీ జిల్లా కన్వీనర్ ఎం.నాగేశ్వర్, సీపీఎం కార్యదర్శి వెంకటయ్య, సీపీఐ కార్యదర్శి పీర్‌మహ్మద్, బీఎంపీ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో బంద్

షాబాద్: బీసీలకు రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా షాబాద్‌లో శనివారం బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బంద్ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి పాల్గొని ముంబాయి- బెంగళూరు లింక్ జాతీయ రహదారిపై రాస్తారోక నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో బీసీల కులాలన్నీ ఏకమై మరో తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుడతామని చెప్పారు. కార్యక్రమంలో రాజేందర్‌గౌడ్, రవీందర్, వెంకట్‌యాదవ్, నర్సింలు, చంద్రయ్య, దయాకర్‌చారి, బాల్‌రాజ్, మహేందర్, రమేశ్ పాల్గొన్నారు.



పరిగి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


షాబాద్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

ఆమనగల్లులో డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు కృషి


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో అన్ని డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కార్యాలయాల ఆవశ్యకతపై వివరించగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఆమనగల్లులో ఎస్టీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు నారోజు రామనాథం, ప్రధాన కార్యదర్శి జంగయ్య, కోశాధికారి సుదర్శన్‌రెడ్డిలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో 694 మంది రిటైర్డ్ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్లు ఉన్నారని తెలిపారు. సబ్ ట్రెజరీ ఆఫీసు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల వారు మహేశ్వరం ఎస్టీవో, మాడ్గుల మండలం వారు ఇబ్రహీంపట్నం, తలకొండపల్లికి చెందిన రిటైర్డ్ ఎంప్లాయిస్ షాద్‌నగర్‌లకు వెళ్తున్నామని ఎమ్మెల్యేతో వాపోయారు. స్పందించిన కసిరెడ్డి కార్యాలయ ఏర్పాటుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ ఛైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, నాయకులు మండ్లీ రాములు, కాలె మల్లయ్య, జగన్, మానయ్య, కృష్ణనాయక్, సాయిరెడ్డి, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి కోరారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆమనగల్లు మండల పరిషత్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఒక జూనియర్ అసిస్టెంట్ మినహా అధికారులు, సిబ్బంది లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా యాబ్సెంటైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాదికారులకు ఫోన్ చేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆర్డీవో కార్యాలయం వద్ద హైడ్రామా

● సర్టిఫైడ్ ఎలక్టోరల్ రోల్ కోసం రైతుల పడిగాపులు
● ఎట్టకేలకు పత్రాలు చేతికందడంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్లకు మార్గం సుగమం

ఇబ్రహీంపట్నం/యాచారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ బాధిత రైతులు నగరంలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. యాచారం మండలం మేడిపల్లి, కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్ గ్రామాల రైతుల పట్టా భూములను గత ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చింది. ఆ సర్వే నంబర్లను టీజీఐఐసీ పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. దీంతో కొందరు రైతులు కోర్టు ఆశ్రయించారు. కాగా ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు మాయ మాటలు చెప్పి తమను మోసగించారని రైతులు ఆరోపిస్తున్నారు. తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి తమ పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. అంతేగాక ప్రభుత్వలు ఇచ్చే రైతు భరోసా, పీఎం కిసాన్ యోజన, బ్యాంకు రుణాలు తమకు రావడం లేదని చెబుతున్నారు. ఇందుకు నిరసనగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నామినేషన్లు వేయాలని నిర్ణయించుకున్న 12మంది రైతులు సర్టిఫైడ్ ఎలక్టోరల్ రోల్ కోసం ఈ నెల 15న ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. నామినేషన్ల గడువు దగ్గర పడుతుండగా ఆర్డీవో కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని తమకు సర్టిఫైడ్ ఎలక్టోరల్ రోల్ పత్రాలు చేతికందే అవకాశం లేదంటూ ఓ దశలో రైతులు, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు ఆందోళనకు సిద్ధమయ్యారు. కాగా శిల్పకళా వేదికలో సీఎం కార్యక్రమంలో ఉన్న ఆర్డీవో అనంతరెడ్డి శనివారం సాయంత్రం దరఖాస్తుదారులకు సర్టిఫైడ్ ఎలక్టోరల్ రోల్ పత్రాలు అందజేశారు. దీంతో రైతులకు నామినేషన్ వేసేందుకు మార్గం సుగమమైంది.


ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద సర్టిఫైడ్ ఎలక్టోరల్ రోల్ పత్రాలతో ఫార్మాసిటీ బాధిత రైతులు

చికెన్ దుకాణాదారులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న ఎండీ జకీ

మేడ్చల్ టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చికెన్ వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులను ఆదుకోవాలని చికెన్ దుకాణాల అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ జకీ అన్నారు. మేడ్చల్‌లో శనివారం చికెన్ షాపుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జకీ మాట్లాడుతూ.. కార్పొరేట్ కంపెనీలు చికెన్ వ్యాపారాన్ని శాసిస్తుండటంతో చిరు వ్యాపారుల మనుగడ ప్రశ్నార్థకమైందన్నారు. ఆయా సంస్థలతో చర్చలు జరిపి ధరలు నిర్దేశించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అమీర్, మక్బూల్, సయ్యద్ ఇనాయత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బంద్ సంపూర్ణం


షాద్‌నగర్ : బంద్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు


శంకర్‌పల్లి : మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప


మహేశ్వరం : బంద్ సందర్భంగా డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు


శంషాబాద్ : నిరసనలో వివిధ పార్టీల నాయకులు


తలకొండపల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు


కేశంపేట : బంద్ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చేవెళ్ల : పట్టణ కేంద్రంలో నిర్వహించిన రాస్తారోకోలో ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు, కార్యకర్తలు


కొత్తూర్ : నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


కొందుర్గు : ధర్నాలో వివిధ పార్టీల నాయకులు


షాబాద్ : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


యాచారం : రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

(ఏడో పేజీ తరువాయి)

వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా షాపులను మూసివేశారు. అలాగే బంద్ ప్రభావం ఇతర వ్యవస్థలపై కూడా పడింది. ప్రైవేటు స్కూళ్లు, కాలేజీ యాజమాన్యాలు ముందుగానే సెలవు ప్రకటించాయి. అధికార కాంగ్రెస్ పార్టీ బంద్‌కు మద్దతు ఇవ్వడంతో పలుచోట్ల జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ ఇతర రాజకీయ పార్టీల నేతలు ఈ బంద్‌లో పాల్గొన్నారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారితో పాటు సాగర్, శ్రీశైలం, బీజాపూర్ జాతీయ రహదారులను ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు దిగ్బంధించారు. రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించడంతో అనేకచోట్ల భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆమనగల్లు పట్టణంలో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే యాదయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై భారీగా ర్యాలీ నిర్వహించారు. షాద్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో సహా కాంగ్రెస్ పార్టీ నాయకులు షాద్‌నగర్ పట్టణంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం పార్టీ నేతలు వేర్వేరుగా బంద్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో జరిగిన బంద్ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, సామేల్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ్మ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, త్యాలపల్లి కృష్ణ, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్, రాఘవేందర్ బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్‌తోపాటు పలువురు నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. సాగర్ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి బస్ డిపో ముందు బైఠాయించారు. సీపీఎం నాయకులు బైక్‌లపై తిరిగి బంద్ చేయించారు.


చౌదరిగూడ : ధర్నాలో వివిధ పార్టీల నాయకులు


కందుకూరు : మానవహారం నిర్వహించి నిరసన తెలుపుతున్న బీసీ సంఘం జేఏసీ నాయకులు


మంచాల : బస్టాండు చౌరస్తాలో ధర్నా చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

కట్టుదిట్టంగా భద్రత

బంద్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలీసు సిబ్బంది, నిఘా బృందాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బంద్‌ను పర్యవేక్షించాయి. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పోలీసు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించారు.

రెట్టింపు చార్జీలు

బంద్‌ను పురస్కరించుకుని ఆర్టీసీ బస్సులు తిరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీపావళి పండుగకు సొంతూళ్లకు వెళ్లేవారు కష్టాలు అన్నీఇన్నీ కావు. బంద్ పరిస్థితులను ప్రైవేట్ వాహనాల వారు సొమ్ము చేసుకున్నారు. ప్రజల నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేశారు. అత్యవసర పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతో ఇదే అదునుగా ఇష్టానుసారం డబ్బులు వసూలు చేశారు. బంద్ కారణంగా ఇతర ప్రజా రవాణా సదుపాయం లేకపోవడంతో ప్రజలు గత్యంతరం లేక వారు అడిగినంత ఇచ్చారు. నగర శివార్లలో అనేక ప్రాంతాల్లో అధిక చార్జీలు వసూలు చేశారు. బస్సుల్లో రూ.100 చార్జి ఉంటే రూ.200 నుంచి 250 వరకు వసూలు చేశారు.


కడ్తాల : జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు


ఆమనగల్లు : బీసీ ఐక్యవేదిక శిబిరంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, నాయకులు

గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు

క్రైం కార్నర్


రైతు పొలం వద్ద సాగుచేసిన గంజాయి మొక్కలు

కేశంపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేములనర్వలో గంజాయి మొక్కలను సాగుచేస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కొప్పర్తి శ్రీను(51) కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి వలస వచ్చి లీజుకు భూమి తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తాను లీజుకు తీసుకున్న వ్యవసాయ భూమి సర్వేనెంబర్ 139లో కూరగాయలతో పాటు 7 గంజాయి మొక్కలను సాగుచేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం శ్రీను లీజుకు తీసుకుని సాగుచేస్తున్న వ్యవసాయ భూమిలో తనిఖీ చేశారు. కూరగాయల సాగు మధ్య 7 గంజాయి మొక్కలు సాగుచేస్తున్నట్లు గుర్తించారు. వాటికి పీకి తూకం వేయగా 6.135 కిలోలు ఉన్నట్లు పోలీసులు నిర్ధారణ చేశారు. అనంతరం మొక్కలను సీజ్ చేశారు. యూట్యూబ్‌లో వీడియో చూసి, హిమాలయన్ హెంప్ సీడ్స్ నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశానని నేరం అంగీకరించడంతో శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(బి), 20(ఏ)(ఐ) కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరహరి తెలిపారు. ఎవరైనా గంజాయిని సాగు చేసినా, రవాణా చేసినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

రాజ్యాంగాన్ని సవరించి బీసీ రిజర్వేషన్లు కల్పించాలి

(ఏడో పేజీ తరువాయి)

బీఆర్ఎస్ పార్టీ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తేవడం లేదో సమాధానం చెప్పాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు, హైకోర్టులో కూడ పోరాడుతుందని అన్నారు. ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద వంద మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు , మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి దీక్ష చేసిన కేంద్రంలో స్పందన లేదని విమర్శించారు. దేశంలో స్వాతంత్రనంతరం 120 సార్లు రాజ్యాంగంలో మార్పులు చేశారని బీసీ బిల్లు విషయంలో మరోమారు సవరణ చేయాలని జూపల్లి కోరారు. బిల్లు ఆమోదం అయ్యేవరకు కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. బీసీ ఐక్యవేదిక నాయకులు అల్లాజీగౌడ్, కేశవులు, మండ్లీ రాములు, దుర్గయ్య, పోనుగోటి అర్జున్‌రావు, డాక్టర్ నర్సింహ్మ, వస్పుల మానయ్య, పత్యానాయక్, శివలింగం, జగన్, గాజుల శ్రీను, చుక్క నిరంజన్‌గౌడ్, బాబా, బాలకృష్ణ, రాము, విజయ్, ప్రసాద్, రమేశ్‌గౌడ్, శ్రీనునాయక్, వెంకటేశ్, కుమార్‌గౌడ్, గణేశ్, అప్పం శ్రీను, కాలె మల్లయ్య, వస్పుల సాయిలు, ఖాదర్‌ఖాద్రి, నరేందర్, నిరంజన్, శ్రీకాంత్, మల్లయ్య, నాగభూషణం, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లికి ఘన సన్మానం

ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆమనగల్లు పట్టణంలో శనివారం ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి కల్వకుర్తి వెళ్తున్న మంత్రికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని మంత్రి పార్టీ శ్రేణులకు సూచించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. నాయకులు తదితరులు ఉన్నారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కాశీనాథ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

కడ్తాల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాశీనాథ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ముద్విన్ గ్రామాభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ముద్విన్‌కు చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, విశ్రాంత ఈవో శ్రీపాతి కాశీనాథ్‌రెడ్డి ఇటీవల మృతిచెందాడు. శనివారం మృతుడి భార్య మాజీ ఎంపీటీసీ నిర్మలాదేవి, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కాశీనాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాములు, చేగూరి వెంకటేశ్, బీచ్యానాయక్, రాఘవేందర్, నరేశ్, తుల సీరామ్, సుమన్, కరుణాకర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

గిరిజన నేత మృతి.. ఎమ్మెల్యే సంతాపం

ఆమనగల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి కాంగ్రెస్ గిరిజన రాష్ట్ర నాయకుడు కృష్ణనాయక్ తండ్రి గిరిజన నేత వెంకటయ్యనాయక్ మృతిపట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంతాపం తెలిపారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం ఆయన మృతిచెందాడు. ఆమనగల్లు మున్సిపాలిటీ నుచ్చుగుట్ట తండాలోని ఆయన నివాసంలో భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుమారుడు కృష్ణనాయక్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లి రాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, జగన్, మానయ్య, మాజీ జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, నాయకులు ఖాదర్ ఖాద్రీ, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల తరలింపు.. రూ.18 వేల జరిమానా

ఆమనగల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని అధికారులు అడ్డుకున్నారు. అంజద్ అనే వ్యక్తి చికెన్ వ్యర్థాలు తరలిస్తున్నారనే సమాచారంతో శనివారం వాహనాన్ని తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ రూ.18వేలు జరిమానా విధించారు. తనిఖీల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సిబ్బంది రామకృష్ణ, మహబూబ్, గోపాల్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు చల్లంపల్లిలో వైద్యశిబిరం

కడ్తాల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో నేడు(ఆదివారం) ఐక్యత ఫౌండేషన్, వన్ మెడిహబ్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాధితులకు నాయకుల పరామర్శ


ఆర్థికసాయం అందిస్తున్న మహేశ్

తలకొండపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న తలకొండపల్లి మండలం మదాయిపల్లికి చెందిన వెల్జాల ఉన్నత పాఠశాల విద్యార్థినీలు లక్ష్మీప్రసన్న, గౌతమిలను శనివారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుజ్జల మహేశ్ పరామర్శించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రూ.5వేలు ఆర్థికసాయం చేశారు. ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీ, నాయకులు నర్సింహులు, అజీజ్, ఆరిఫ్, కృష్ణయ్యగౌడ్, తదితరులున్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ఆచారి



ఆమనగల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని శనివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను కిషన్‌రెడ్డికి వివరించారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించాలని ఆచారి కోరగా కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 31న జరిగే తన కుమారుడు తల్లోజు భరత్ నిశ్చితార్థానికి రావాలని కిషన్‌రెడ్డిని ఆహ్వానించినట్లు ఆచారి పేర్కొన్నారు.

విద్యార్థులకు సహకారం అభినందనీయం


విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాత నర్సింహారెడ్డి

చేవెళ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సమాజంలోని దాతలు తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని, వారి చేయూత అభినందనీయమని ఖానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ అన్నారు. శనివారం చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కొత్త కాపు నర్సింహారెడ్డి విద్యార్థులకు నోట్‌బుక్స్, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాల భవనానికి రంగులు వేయిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. తాను ఇదే ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించానని గుర్తుచేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం నిరంతరం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, విజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

కడ్తాల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు టేకుల మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విఠలయ్య గౌడ్‌లు అన్నారు. వైద్యచికిత్సలు పేదలకు భారం కాకూడదని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా విరివిగా ప్రభుత్వం సాయమందిస్తుందని చెప్పారు. కడ్తాల మండలం రావిచెడ్ గ్రామానికి చెందిన పోచమ్మకు రూ.8వేలు, మద్దెలకుంట తండాకు చెందిన శ్రీలతకు రూ.35 వేలు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరయ్యాయి. శనివారం గ్రామంలో బాధిత కుటుంబాలకు మహేందర్‌రెడ్డి, విఠలయ్యగౌడ్, శ్రీనివాస్‌లు చెక్కులు అందజేశారు. జనార్దన్‌గౌడ్, రమేశ్‌గౌడ్, యాదయ్య, భాస్కర్, రాజు, పారేశ, రాఘవేందర్, వెంకటేశ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

కేశంపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అవుతుందని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి అన్నారు. పాలమూరు ఎంపీ డీకే అరుణ రూ.2.5లక్షల ఎంపీ నిధులతో మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ గ్రామానికి సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని గతంలో ఎంపీ అరుణను కోరినట్లు తెలిపారు. తన వినతికి స్పందించిన ఆమె హైమాస్ట్ లైట్లు వేయించారని తెలిపారు. త్వరలో సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయనున్నట్లు ఎంపీ తెలిపిందని చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజలు బీజేపీ వైపు ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, యాదగిరి, సురేష్, నారాయణ, వెంకటయ్య, శీను, శేఖర్, యాదగిరి, రామకృష్ణ, నాగేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకుడు తిరుపతి

నేడు కొత్తపేటలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు

కేశంపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను నేడు(ఆదివారం) మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకుడు పాలాది శ్రీనివాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత సహ వ్యవస్థ ప్రముఖ్ గంట తిరుమల్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. స్వయం సేవకులు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.